సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 16 । మే । 2023



ఆదివరాహస్వామికి పూజలు

కమాన్‌పూర్(మంథని): కమాన్‌పూర్‌లోని ఆదివ రాహస్వామి ఆలయంలో సోమవారం భక్తుల రద్దీ నెలకొంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామికి పూజలు చేశారు.



పత్తి క్వింటాలు రూ.7,111

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం పత్తి క్వింటాలు ధర గరిష్ఠంగా రూ.7,111, కనిష్ఠంగా రూ.6,517, సరాసరి ధర రూ.7,010 నిర్ణయించారు.

గరిష్ఠం/కనిష్ఠం
44.0/29.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

‘ఉపాధి’కి నీడేది ?

“ ఈ చిత్రంలో చెట్ల కింద సేదతీరుతున్న కూలీలు కమాన్‌పూర్ మండలం పేరపల్లిలోని ఉపాధిహామీ కూలీలు. జిల్లాలో ఎండలు దంచికొడుతుండడంతో ఉపాధిహామీ కూలీలు ఉపశమనం పొందడానికి పనిచేసే ప్రదేశాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలి. కానీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఎండలోనే ఇబ్బందులు పడుతూ పనులు చేస్తున్నారు.



- మంచినీళ్లు లేవు మెడికల్ కిట్లూ కనిపించవు
- ఎండలో చెట్ల నీడే దిక్కు
- సౌకర్యాల కల్పనలో అధికారుల నిర్లక్ష్యం
- పనులు చేసే చోట కూలీల ఇబ్బందులు



కమాన్‌పూర్ మండలం రాజాపూర్‌లో ఎండలోనే పనిచేస్తున్న ఉపాధిహామీ కూలీలు

సాక్షి, పెద్దపల్లి: పల్లెల్లో వలసల నివారణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధిహామీ పథకంలో వసతులు కరువయ్యాయి. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు కనిపించడం లేదు. తాగునీళ్లు అయితే కూలీలే బాటిళ్లలో ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు చెట్ల నీడను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో చాలా మంది అస్వస్థతకు గురవుతున్నారు. ప్రస్తుతం 45 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు చేరాయి.

అన్నీ అసౌకర్యాలే..

ఉపాధి పనులు చేసే ప్రదేశాల్లో కూలీలు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు టెంట్లు వేయాలి. కానీ ఎక్కడ కనిపించడం లేదు. గతంతో కొనుగోలు చేసిన వేసవి కిట్లు పాడైపోయినప్పటికీ కొత్తవి కొనుగోలు చేయడం లేదు. మెడికల్ కిట్లు నామమాత్రమే అయ్యాయి. అధికారులు పట్టించుకోకపోవడంతో ఇంటి నుంచి బాటిళ్లలోనే కూలీలు నీళ్లు తెచ్చుకుంటున్నారు. అయితే పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో తరచూ తాగడంతో ఆ నీళ్లు గంటలోనే ఖాళీ అవుతున్నాయి. తర్వాత తాగేందుకు నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. మళ్లీ తెచ్చుకోలేక ఉన్న నీటితోనే సరిపెట్టుకుని డీహైడ్రెషన్‌కు గురవుతున్నారు. వడదెబ్బ సోకే ప్రమాదమున్నప్పటికీ మంచినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, టెంటు, పనిచోట ప్లాస్టిక్ కవర్లు, ప్రాథమిక చికిత్స కిట్లు కనిపించడం లేదు.

ఏళ్లుగా అందని పరికరాలు

ఉపాధిహామీ కూలీలకు పార, గడ్డపార, తట్టలు వంటి సామగ్రి ఇచ్చేవారు. ఇప్పుడు అవేమి ఇవ్వడం లేదు. గడ్డపార మొన పదును చేయించుకునేందుకు తమ జేబుల్లో నుంచే రూ.120 వెచ్చిస్తున్నామని కూలీలు వాపోతున్నారు. గ్రామం నుంచి 5 కిలోమీటర్లకు పైగా దూరం వెళ్తే రవాణాభత్యం చెల్లించేవారు. అదేవిధంగా వేసవి భత్యం కూడా ఇచ్చేవారు. ఇప్పుడు ఇవేవీ లేవు. చేసిన పనిదినాలకు ప్రతీ 15 రోజులకోసారి తమ ఖాతాల్లో నగదు జమకావాల్సి ఉండగా, నెలల తరబడి జాప్యమవుతోంది. గతంలో రాష్ట్ర సాఫ్ట్‌వేర్ ఉన్నప్పుడు నీడ, నీరు, పరికరాల భత్యాలు చెల్లించేవారు. ఇప్పుడు ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చాక అవేవీ అందడం లేదు. ఉపాధిహామీ కూలీల సమస్యలపై డీఆర్‌డీవోను వివరణ కోరగా నీడ ఏర్పాటుకు టెంట్లు వేయాల్సిన బాధ్యత పంచాయతీలదేనన్నారు. సమస్య ఉన్న చోట సమకూరుస్తామని తెలిపారు.

జిల్లాలో ఉపాధిహామీ వివరాలు

జాబ్‌కార్డులు	1,16,788
నమోదైన కూలీలు	2,39,332
కుటుంబాలు	35,554
యాక్టివ్ జాబ్‌కార్డులు	74,648
పనిచేస్తున్న కూలీలు	1,21,968

కనీస వసతులు లేవు



పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించడం లేదు. తాగునీటి సౌకర్యం లేక, మేము తీసుకెళ్తున్న ఒక్క వాటర్ బాటిల్ సరిపోవడం లేదు. కనీసం నీడ సౌకర్యం లేక చెట్ల కింద వడగాలుల మధ్యనే ఇబ్బందిపడుతున్నం.

– బానోత్ రవినాయక్, ధర్మారం

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలి



ఇంటికాడి నుంచే నీళ్లు పట్టుకపోతున్నాం. ఎలాంటి నీడ సౌకర్యం లేదు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్ వేయడం లేదు. పాము ,పురుగు కుట్టిన పట్టించుకునే వారు లేరు. ఎండలో పనిచేస్తున్న కూలి గిట్టడం లేదు. డీహైడ్రేషన్ కాకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి.

– ముత్యాల శంకరమ్మ, ఉపాధిహామీకూలీ, కొలనూర్

సమస్యలు ఆలకించండి

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్
- వివిధ సమస్యలపై 42 దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించే వేదికగా ప్రజావాణి పనిచేస్తుందన్న నమ్మకాన్ని పెంచేలా అధికారులు పనిచేయాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 42 దరఖాస్తులను పెద్దపల్లి, మంథని ఆర్డీవోలు వెంకటమాధవరావు, వీరబ్రహ్మయ్యలతో కలిసి స్వీకరించారు. అందులో 28 రెవెన్యూ సంబంధమైనవే కాగా మిగతా 14 ఇతర శాఖలకు సంబంధించినవని పేర్కొన్నారు. అంతర్గాం మండలం మద్దిర్యాలకు చెందిన మల్క సత్తయ్య తనకున్న భూమిలో నుంచి 15 గుంటలు ఎస్సారెస్పీ కాలువ కోసం పోతే మరో ఐదు గుంటలను ఎక్కువగా రాశారని, దాన్ని సవరించాలని కోరారు.

అంత్యక్రియలు చేసేదెలా ?



పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో నిర్మించిన వైకుంఠ ధామం పక్కనే ఇటుక బట్టీ ఏర్పాటు చేశారు. ఎవరైన చనిపోతే అంత్యక్రియలు చేసేందుకు ఇబ్బందిగా ఉంది. మట్టి, బూడిదకుప్పలు పోస్తున్నారు. అందులో పనిచేసే కూలీలు శ్మశానవాటికలోనే మల, మూత్రవిసర్జన చేస్తుండడం ఇబ్బందిగా మారింది. శ్మశానవాటికకు వచ్చే వారికి ఇబ్బందుల్లేకుండా చూడాలి.

– హన్మంతునిపేట గ్రామస్తులు

ట్రైసైకిళ్లకు మరమ్మతులేవి?



దివ్యాంగులకు ప్రభుత్వం అందించిన బ్యాటరీ ట్రైసైకిళ్ల పనిముట్లు నాసిరకంగా ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేసేందుకు స్థానికంగా మెకానిక్‌లు అందుబాటులో లేరు. వీటిని సరఫరా చేసిన వారిని రప్పించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు.

– మహంకాళి తిరుపతి, వెంకట్రావుపల్లి

నాది మిగులు భూమి అట



మా తండ్రి రహీం నుంచి వారసత్వంగా వచ్చిన సర్వే నంబర్ 42లోని 35 గుంటల భూమిని ఆన్ రికార్డుల్లో మిగులు భూమిగా పేర్కొని అన్యాయం చేస్తున్నారు. నెలల తరబడి ఫిర్యాదులు చేస్తున్నా పరిష్కరించడం లేదు. నా తండ్రి మరణించిన తర్వాత నా సోదరుల పేరిట విరాసత్ చేసిన అధికారులు నన్ను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారో అర్థం కావడం లేదు.

– ఎండీ చాంద్‌పాషా, పెద్దపల్లి

బతుకు దారి చూపండి



నేను బీకాం(కంప్యూటర్స్) చదివిన. భార్య కూలి పనులకు వెళ్తేనే కుటుంబం గడుస్తుంది. దివ్యాంగుడైన నాకు ఉపాధి చూపండి. స్వయం ఉపాధి కోసం సబ్సిడీ రుణమైనా ఇప్పించండి.

– పల్లపు రాజేశం, బొంపల్లి

ఎండ నుంచి ఉపశమనానికి కూలర్లు

- జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు
- మాతాశిశు కేంద్రంలో కూలర్ల ఏర్పాటు



కూలర్లను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ పుట్ట మధు

మంథని: ఎండ తీవ్రత, ఉక్కపోతతో పేదింటి ఆడబిడ్డలు, చంటిపిల్లలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు పుట్టలింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో కూలర్లు ఏర్పాటు చేస్తున్నట్లు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు పేర్కొన్నారు. మంథనిలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన కూలర్లను సోమవారం ప్రారంభించారు. శ్రీపాద ట్రస్టు ఎక్కడ సేవలందిస్తుందో చెప్పాలని కోరారు. వరదల్లో ఆస్పత్రి మునిగితే పట్టించుకోలేదని, తామే ముందుకొచ్చి చర్యలు తీసుకున్నామన్నారు. అనంతరం మంథని మండలం కాకర్లపల్లిలో ఉపాధిహామీ పథకం ద్వారా రూ.20లక్షలతో నిర్మించే జీపీ భవన నిర్మాణానికి జెడ్పీ చైర్మన్ మధు భూమిపూజ చేశారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం

గ్రామీణ క్రీడాకారులను గత ప్రభుత్వాలు విస్మరించాయని, సీఎం కేసీఆర్ నాయకత్వంలోని సర్కారు వారికి తగిన గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తుందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధు అన్నారు. మంథనిలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆవరణలో జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడలను మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి ప్రారంభించారు. జిల్లా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల కో–ఆర్డినేటర్ వాసుదేవారెడ్డి, మంథని ఆస్పత్రుల సూపరింటెండెంట్ కంది శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, జెడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎక్కేటి అనంతరెడ్డి, ఎంపీడీవో రమేశ్, ఎస్సై వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో జాతీయ ఫెస్ట్

- ఘనంగా మంథని జేఎన్టీయూ కాలేజీ వార్షికోత్సవం
- రెండు రోజులపాటు వేడుకలు



విద్యార్థులు తయారు చేసిన యూనిట్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్, సిబ్బంది

కమాన్‌పూర్(మంథని): మంథని జేఎన్టీయూ ఇంజినీరింగ్ కాలేజీ వార్షికోత్సవం సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా రెండు రోజులపాటు నిర్వహించే జాతీయస్థాయి టెక్నికల్, నాన్‌టెక్నికల్ సాంకేతిక ఫెస్ట్‌ను కళాశాల ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. మైనింగ్ విద్యార్థులు మినీరియ పేరుతో ఈఈఈ విద్యుత్ వికాస్, సీఎస్సీ ఆకృతి, సివిల్ ధైర్య, మెకానికల్ ఎంతోచావ్, సీఎస్ఎం అవిన్య పేర్లతో ఈవెంట్స్ నిర్వహించారు. మైనింగ్ విద్యార్థులు భూగర్భగనులతో పాటు ఓపెన్‌కాస్టు మైన్ మోడల్‌ను తయారు చేశారు. పలు విభాగాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఈఈఈ విభాగాధిపతి దుర్గారావు, డీఈఈ సతీశ్, ఆఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ఆర్‌ఎఫ్‌సీఎల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



జ్యోతినగర్(రామగుండం): రామగుండం ఎరువుల కంపెనీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర కార్మికశాఖ అధికారికి ఆర్‌ఎఫ్‌సీఎల్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు అంబటి నరేశ్ డిమాండ్ నోటీసు అందించారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని కేంద్ర కార్మికశాఖ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించి మాట్లాడారు. ఎరువుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు మెరుగైన వేతనాలు అందించాలని కోరారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. లింగాల సారయ్య, బత్తుల రాములు, రాజయ్య, బోయిని నాగరాజు, వెంకటేశ్, రవికుమార్, శ్రీనివాస్, అశోక్, ఉదయ్‌కిరణ్ పాల్గొన్నారు.

క్రీడలకు ప్రాధాన్యత



సుల్తానాబాద్(పెద్దపల్లి): రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తుందని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం సీఎం కేసీఆర్ క్రీడా పోటీలను ప్రారంభించి, మాట్లాడారు. యువత, విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని కోరారు. తడిసిన ధాన్యాన్ని చివరిగింజ వరకు కొంటామన్నారు. ఎంపీపీ బాలాజీరావు, జెడ్పీటీసీ మినుపాల స్వరూప, మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, ఎంపీడీవో శశికళ, ఎంపీవో వలీ, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ బుర్ర మౌనిక, మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

శాస్త్రవేత్తల బృందం పర్యటన



పెద్దపల్లిరూరల్: పంటల సాగుపై చీడ, పీడల ఉధృతి ప్రభావం, ప్రకృతి విపత్తులు దిగుబడులపై ఏ మేరకు ప్రభావం చూపుతున్నాయనే అంశాలపై సోమవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది. అందులో భాగంగా పెద్దపల్లి మండలంలోని నిట్టూరు, రాగినేడు, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో పర్యటించిన శాస్త్రవేత్తలు పలువురు రైతులతో మాట్లాడారు. పంట మార్పిడి విధానం అమలుతో వచ్చే ఫలితాలను వివరించారు. శ్రీనివాస్, రామస్వామి, సంతోష్, సంపత్, సాగర్‌రావు, రాజేశ్వర్‌రావు ఉన్నారు.

ఎన్టీపీసీ కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె నోటీస్



జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ రామగుండం సంస్థ యాజమాన్యానికి ఎన్టీపీసీ రామగుండం కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్స్ యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో సోమవారం సమ్మె నోటీసు అందించారు. కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ఎన్టీపీసీలని పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్టు కార్మికులు 38 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. 2022 ఆగస్టు 15తో వేతన ఒప్పందం ముగిసినప్పటికీ కొత్తగా ఒప్పందం చేసుకోవడంలో జాప్యం చేస్తున్నారన్నారు. నోటీస్ అందించిన 15 రోజుల తర్వాత సమ్మెలోకి వెళ్తామని.. ఆలోపు స్పందించాలని కోరారు. ఈమేరకు 14 డిమాండ్లతో కూడిన సమ్మె నోటీసు అందించినట్లు వెల్లడించారు. అంతకుముందు ప్రాజెక్టు లేబర్ గేట్ ఏరియాలో కాంట్రాక్ట్ కార్మిక సంఘాల యునైటెడ్ ఫోరం ఆధ్వర్యంలో గేట్‌మీటింగ్ నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.ముత్యంరావు మాట్లాడుతూ వెంటనే నూతన వేతన ఒప్పందం చేసుకోవాలని కోరారు. ఒప్పంద ముగిసినప్పటికీ యాజమాన్యం స్పందించడలేదన్నారు. వెంటనే ఒప్పందం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, భూమల్ల చందర్, రాధారపు రాజమల్లయ్య, ఇజ్జగిరి భూమయ్య, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అండగా ఉంటున్నాం

- సంక్షేమశాఖమంత్రి కొప్పుల ఈశ్వర్
- తేలుకుంటలో అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ



తేలుకుంటలోని సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్

జూలపల్లి(పెద్దపల్లి): దళితబంధుతో ప్రతీ దళిత కుటుంబానికి రూ.10 లక్షలు అందిస్తూ.. వారి అభ్యున్నతికి అండగా ఉంటున్నామని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. మండలంలోని తేలుకుంటలో సోమవారం అంబేడ్కర్ విగ్రహాన్ని మండలి విప్ భానుప్రసాదరావు, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ప్రతీ మండలంలో రెసిడెన్షియల్ పాఠశాల, సెక్రటేరియట్ ఎదుట 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదన్నారు. దళిత విద్యార్థుల విదేశీ చదువులకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయం ఇస్తున్నామన్నారు. శాసన మండలి విప్, ఎమ్మెల్సీ భానుప్రసాదరావు మాట్లాడుతూ కులమతాలకతీతంగా రాజ్యాంగాన్ని రూపొందించిన మహా వ్యక్తి అంబేడ్కర్ అని పేర్కొన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ మేధావిగా, రాజ్యంగ నిర్మాతగా గుర్తింపు పొందిన అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్, జెడ్పీ వైస్‌చైర్మన్ మండిగ రేణుక, రచయిత, కవి కాలువ మల్లయ్య, సర్పంచులు సొల్లు పద్మశ్యామ్, నర్సింహయాదవ్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తూకంలో కోతలు పెడితే చర్యలు

పెద్దపల్లిరూరల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకంలో కోతలు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో సోమవారం ధాన్యం కొనుగోళ్లపై మండలి చీఫ్‌విప్ భానుప్రసాదరావు, కలెక్టర్ సంగీత, ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డితో కలసి సమీక్షించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకుంటామని మంత్రి భరోసానిచ్చారు. ఇప్పటికే తొలి విడతగా పంటలు నష్టపోయిన 5,790 మంది రైతులకు రూ.6.91 కోట్ల పరిహారం అందించామన్నారు. రైతు సమస్యల పేరిట ప్రతిపక్షాలు అనవసరపు రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్, జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్, డీఎస్‌వో వెంకటేశ్, డీఏవో ఆదిరెడ్డి, డీఆర్డీవో శ్రీధర్, డీసీవో మైఖేల్‌బోస్ ఉన్నారు.

పాలీసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

పెద్దపల్లిరూరల్: జిల్లాలో బుధవారం నిర్వహించే పాలీసెట్ పరీక్షకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, పాలీసెట్ జిల్లా కోఆర్డినేటర్ లక్ష్మీనర్సయ్య తెలిపారు. జిల్లాలోని ఏడు సెంటర్ల చీఫ్ సూపరింటెండర్లతో సోమవారం పరీక్ష నిర్వహణపై సమీక్షించారు. ఉదయం 10 నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని 11 గంటలు దాటితే ఎవరిని అనుమతించబోమని స్పష్టం చేశారు.

ప్రభుత్వం బీసీ బంధు ప్రకటించాలి

గోదావరిఖనిటౌన్(రామగుండం): రాష్ట్ర ప్రభుత్వం బీసీబంధు పథకాన్ని ప్రకటించాలని వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డాక్టర్ సురభీ శ్రీధర్ కోరారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు సమన్యాయం చేసేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. దళితులకు దళితబంధు ఎలా అమలు చేస్తున్నారో బీసీలకు కూడా బీసీబంధు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పల్లెల్లో మద్యం చిచ్చు

‘మంథని సమీపంలోని భట్టుపల్లి గ్రామంలో ఇటీవల ఓ తండ్రి తాగిన మైకంలో కూతురిని హత్య చేసిన విషయం తెలిసిందే. ఆ గ్రామంలో కిరాణ దుకాణంలోనే మందు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. ఆ నిందితుడు బెల్టుషాపు వద్దకు వెళ్లి మందు అడిగితే ఇవ్వనందుకు సదరు దుకాణం యజమానిపై సైతం గొడ్డలితో దాడి చేశాడు’.

“

‘మంథని నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లిన కిరాణదుకాణాల్లోనే మందు విక్రయిస్తుంటారు. ముందు కిరాణషాపు ఉంటే.. వెనుక వైపు సిట్టింగ్ కొనసాగుతుంటుంది. కిరాణ సామగ్రి కోసం దుకాణాల వద్దకు వస్తున్న పురుషులు ఒక 90 ఎంఎల్ తాగిపోతుంటారు. ఇది ఇక్కడ సర్వసాధారణం. తెల్లవారక ముందే కిరాణషాపుల వద్దకు మందు కోసం వస్తుండడం నిత్యం కనిపిస్తుంటుంది’.

- గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు దుకాణాలు
- రాత్రింబవళ్లు మద్యం దొరుకుతున్న వైనం
- తాగిన మత్తులో తగాదాలు
- పెరుగుతున్న నేరాలు
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ అధికారులు



మంథని: జిల్లాలోని పల్లెలు మద్యం మత్తులో తూగుతున్నాయి. బెల్టుషాపుల్లో ఎప్పుడు పడితే అప్పుడు మందు దొరుకుతుండడంతో మందుబాబులు రెచ్చిపోతున్నారు. మద్యం మత్తులో ఏ పల్లె చూసిన పంచాయితీలతోనే తెల్లారుతున్నాయి. అనేక కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి. మద్యంమత్తులో బంధాలు.. అనుబంధాలు మరిచి తోబుట్టువులు.. కన్నవారినే కడతేరుస్తున్నారు. తాజాగా మంథని మండలంలోని భట్టుపల్లిలో పదేళ్ల చిన్నారిని కన్న తండ్రి హతమార్చడం ఆందోళన కలిగిస్తుంది. అక్రమ మద్యాన్ని అడ్డుకోవాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా పల్లెల్లో బెల్టు షాపుల ద్వారా మద్యం ఏరులై పారుతోంది.

నిబంధనలు బేఖాతరు

జిల్లాలోని మంథని నియోజకవర్గంలో ఏ పల్లెకు పోయిన కిరాణదుకాణాల్లోనే మందు విక్రయిస్తుంటారు. ప్రభుత్వం నుంచి అనుమతి పొందిన వైన్ షాపులు ఉదయం 10 గంటలకు తెరుచుకుంటుంటే.. గ్రామాల్లో బెల్టుషాపులు మాత్రం 24 గంటలు మందుబాబులకు సేవలందిస్తున్నాయి. దీంతో పచ్చనికాపురాల్లో బెల్టుషాపులు చిచ్చుపెడుతున్నాయి. ఒక్కో గ్రామంలో కనీసం ఐదు బెల్టుషాపులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యి బెల్టు దుకాణాలు ఉన్నట్లు ఎక్సైజ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

మద్యం మత్తులో అసాంఘిక చర్యలు

గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టు షాపులు నిర్వహిస్తుండడంతో అనేక మంది మద్యానికి బానిసవుతున్నారు. మద్యం మత్తులో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. మద్యానికి అలవాటుపడి యువత భవిష్యత్‌ను కోల్పోతున్నారు.

– బూడిద గణేశ్, జిల్లా కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం

బెల్టు దుకాణాలకు అనుమతులు లేవు

గ్రామాల్లో బెల్టు దుకాణాల నిర్వాహణకు అనుమతులు లేవు. అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. ఫిర్యాదులు వస్తే విచారణ చేసి చర్యలు తీసుకుంటాం.

– గురువయ్య, ఎక్సైజ్ సీఐ, మంథని

క్లుప్తంగా

పాలకుల అవినీతిపై పోరాడాలి


మాట్లాడుతున్న ప్రజాహిత వేదిక సభ్యులు

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): పాలకుల అవినీతిపై పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని ప్రజాహిత పోరాట వేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం కాల్వశ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన మేనిఫెస్టోను అమలు చేయడంలో విఫలమైందని వేదిక సభ్యులు, ఓదెల జెడ్పీటీసీ గంట రాములు యాదవ్, కాంగ్రెస్ నాయకులు సి.సత్యనారాయణ రెడ్డి, వేముల రామ్మూర్తి ఆరోపించారు. నిరుద్యోగ భృతి, రుణమాఫీ, ఇంటికో ఉద్యోగం, ఇల్లులేని వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి ఇవ్వలేదని తెలిపారు. రాష్ట్రంలో కుటుంబ పాలన నడుస్తోందని, దోచుకో దాచుకో అన్న చందాన పాలకులు తయారయ్యారని మండిపడ్డారు. ఎన్నడూ లేని విధంగా ప్రశ్నపత్రాలు అమ్ముకుంటూ బ్రోకర్ దందాకు తెరలేపారన్నారు. నిరుద్యోగ భృతి కోసం గ్రామాల వారీగా సంతకాలు సేకరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ స్పందించి, ఎన్నికల హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు సమిండ్ల శ్రీనివాస్, తాత సాయికిరణ్ యాదవ్, దండి సాయికుమార్, కత్తుల మహేశ్, వంశీ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొంటలేరని రైతు నిరసన

- పీఏసీఎస్ షట్టర్ మూసి ఆందోళన



సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): ధాన్యం కొనుగోలు చేయడం లేదని ఓ రైతు సుల్తానాబాద్ మండలం చిన్న కల్వల పీఏసీఎస్ కార్యాలయం షట్టర్‌ను సోమవారం మూసి నిరసన తెలిపారు. మండలంలోని రెబ్బల్‌దేవ్‌పల్లికి చెందిన రైతు రాజిరెడ్డి గత పదిహేను రోజుల క్రితం గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చారు. పదిహేను రోజులుగా ధాన్యం కొనడం లేదంటూ సోమవారం చిన్నకల్వలలోని పీఏసీఎస్ సంఘం కార్యాలయం షట్టర్‌ను మూసివేసి నిరసన తెలిపారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

వృద్ధుడి దుర్మరణం

మల్లాపూర్(కోరుట్ల): మండలంలోని వేంపల్లి శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బదినపెల్లి గంగరాజం(60) మృతిచెందాడు. స్థానికుల తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగరాజం కుమార్తె సుమలతతో కలిసి గొర్రెపల్లిలో శుభకార్యానికి హాజరై తిరిగి స్వగ్రామమైన వేంపల్లికి బైక్‌పై వస్తుండగా, ఎదురుగా అతివేగంగా అజాగ్రత్తగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి గంగరాజం అక్కడికక్కడే మృతిచెందగా, సుమలత స్వల్పంగా గాయపడింది. విషయం తెలుసుకున్న మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్, పోలీస్ సిబ్బందితో కలిసి ఘటన స్థలికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతుడి భార్య గంగరాజం ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు

- రక్తహీనత సమస్యను అధిగమించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయం
- పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులకు చేరిన కిట్లు
- మంత్రి ఈశ్వర్, ఎమ్మెల్యేల చేతుల మీదుగా పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



న్యూట్రిషన్ కిట్లను పరిశీలిస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి కృపాబాయి

సుల్తానాబాద్(పెద్దపల్లి): పదేళ్ల క్రితం వరకు రాష్ట్రంలో ప్రతీ లక్ష కాన్పులకు సుమారు వంద మంది వరకు బాలింతలు వివిధ కారణాలతో చనిపోయేవారు. దీంతో వారి పిల్లల పరిస్థితి తల్లిలేక దయనీయంగా ఉండేది. ఏటా ఈ మరణాల సంఖ్య పెరుగుతూ ఉండటంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాయి. ఆసుపత్రులతోపాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, నెలవారీగా వ్యాధి నిరోధక టీకాలు వేయడం ద్వారా బలహీనతను తగ్గించాలని భావించారు. గర్భిణుల్లో రక్తం పెరిగేందుకు న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లి జిల్లాకు 681 కిట్లు చేరాయి. రాష్ట్ర ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు దాసరి మనోహర్ రెడ్డి, కోరుకంటి చందర్, జెడ్పీ చైర్మన్ పుట్ట మధుల చేతుల మీదుగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

జిల్లాలో 266 గ్రామ పంచాయతీలు..

పెద్దపల్లి, గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులకు న్యూట్రిషన్ కిట్లు వచ్చాయి. జిల్లాలో 266 గ్రామ పంచాయతీలున్నాయి. సుల్తానాబాద్, మంథని సామాజిక ఆసుపత్రులు, 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 08 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు త్వరలో కిట్లు రానున్నాయి. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి కనీసం మూడుసార్లు ఆసుపత్రిలో చూపించుకునేలా ఆశ కార్యకర్తలు పర్యవేక్షిస్తున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్ల వారీగా గర్భిణుల వివరాలు సేకరించి, అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నారు. రక్తహీనత ఉన్నవారికి మందులు ఇస్తున్నారు. ఇళ్ల వద్ద కాన్పులు చేయించుకోకుండా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లేలా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు చర్యలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు చేయించుకున్నవారికి కేసీఆర్ కిట్‌తోపాటు శిశువులకు తగిన ప్రాథమిక సేవలందుతున్నాయి.

జిల్లా సమాచారం	
గర్భిణులు	4,322
న్యూట్రిషన్ కిట్లు	681
పెద్దపల్లి ఆసుపత్రికి	522
గోదావరిఖని ఆసుపత్రికి	159

న్యూట్రిషన్ కిట్‌లో ఉండేవి..	
తేనె ప్యాకెట్	1
ఖర్జూరం టానిక్స్	3
ఐరన్ టానిక్స్	3

కిట్లు వచ్చాయి..



పెద్దపల్లి జిల్లా ఆసుపత్రికి 522, గోదావరిఖని ఆసుపత్రికి 159 న్యూట్రిషన్ కిట్లు వచ్చాయి. గర్భిణుల్లో రక్తహీనత సమస్య రాకుండా ఉండేందుకు ప్రభుత్వం వీటిని అందించాలని నిర్ణయించింది. మంత్రి, ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్‌లను ఈ వారంలో ఆహ్వానించి, పంపిణీ చేస్తాం. త్వరలోనే పీహెచ్‌సీలకు న్యూట్రిషన్ కిట్లు రానున్నాయి.

– ప్రమోద్ కుమార్, జిల్లా వైద్యాధికారి

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సింగరేణి డైరెక్టర్ల ఆదేశం


వీసీలో పాల్గొన్న అన్ని ఏరియాల జీఎంలు

గోదావరిఖని(రామగుండం): నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని సింగరేణి డైరెక్టర్లు ఎన్వీకే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి, బి.సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం అన్ని ఏరియాల జీఎంలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. రానున్న వర్షాకాలంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. బొగ్గు ఉత్పత్తికి ప్రణాళికలు, ఓవర్ బర్డెన్ తరలింపు, ఓసీపీల్లో ఉత్పత్తికి అంతరాయం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. భారీ వర్షాలు వస్తే ఓసీపీల్లో చేరిన వరద నీటిని తరలించేందుకు వాటర్ పంపులను సిద్ధం చేసుకోవాలన్నారు. ఓసీపీలు, అండర్ గ్రౌండ్ గనుల్లో యంత్రాల వినియోగం, వాటి పనితీరు మెరుగుపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్జీ–1 ఇన్‌చార్జి జీఎం సైదులు, ప్రాజెక్టు అధికారి చంద్రశేఖర్, ఏజీఎం ఆంజనేయులు, మదన్‌మోహన్, చిలుక శ్రీనివాస్, చక్రవర్తి, బాలసుబ్రహ్మణ్యం, దాసరి శ్రీనివాస్, ఆర్జీ–2 ఏరియాలో జీఎం మనోహర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో కొర్రీలు పెట్టొద్దు

- కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి
- కలెక్టరేట్ ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు

పెద్దపల్లిరూరల్: ధాన్యం కొనుగోలులో కొర్రీలు పెట్టొద్దని, రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే తూకం వేసి మిల్లులకు తరలించాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేందర్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నాయకులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందించారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కొనేందుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని ఆరోపించారు. వారిని వెంటనే కట్టడి చేయాలన్నారు. రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఆందోళనలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. నాయకులు సెగ్గెం రాజేశ్, సతీశ్, కిషన్, సత్యం, శ్రీనివాస్, శేఖర్, అజీంఖాన్, ప్రసాద్, శ్రీనివాస్‌యాదవ్, రాజయ్య, రమ, సురేశ్‌రెడ్డి, సహారిక, మల్లేశ్, అనిల్ రెడ్డి తదితరులున్నారు.

అబ్బాపూర్‌లో ఆందోళన..

జూలపల్లి(పెద్దపల్లి): మండలంలోని అబ్బాపూర్‌లో ఐదు రోజులుగా ధాన్యం తూకం వేయడం లేదని రైతులు, కాంగ్రెస్ నాయకులు సోమవారం ఆందోళనకు దిగారు. తరుగు పేరిట క్వింటాల్‌కు ఐదు కిలోల కోత విధిస్తున్నారని రైతులు ఈదుల లకోష్మరెడ్డి, తీగుల్ల రాజిరెడ్డి, మల్లారెడ్డిలు ఆరోపించారు. ధాన్యాన్ని సెకండ్ గ్రేడ్‌తో కొనుగోలు చేస్తామని లేకుంటే కాంటా పెట్టబోమని పీఏసీఎస్ పత్తిపాక పాలకవర్గం అంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత జగిత్యాల డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు సమాచారం అందించారు. వెంటనే వచ్చిన ఆయన రైతులతో మాట్లాడి, సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అన్నదాతలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వ పెద్దలు పట్టించుకోకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయని అన్నారు. బేషరతుగా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు పెద్దిరెడ్డి కిష్టారెడ్డి, సీపెల్లి ఆంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకరి బలవన్మరణం

రామడుగు(చొప్పదండి): వెదిరకు చెందిన దుద్యాల రాజిరెడ్డి (60) ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. రాజిరెడ్డి కుటుంబసభ్యులతో కలిసి బంధువుల ఇంట్లో పెళ్లికి వెళ్లి, సోమవారం మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నాడు. గదిలోకి వెళ్లి, కిటికీకి తాడుతో ఉరేసుకున్నాడు. ఇంటికి చేరుకున్న భార్య దేవేంద్ర చూసి, చుట్టుపక్కల వారికి చెప్పడంతో పోలీసులకు సమాచారం అందించారు. కాగా మృతుడికి కొన్నేళ్లుగా కళ్లు కనిపించడం లేదని, ఆ కారణంగానే ఆత్మహత్య చేసుకొని ఉంటాడని స్థానికులు పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని ఏఎస్సై గుడి అనంతరెడ్డి పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఫోన్ మాట్లాడుతూ.. ముగ్గురిగా వెళ్తూ




నిబంధనలు పాటించండి.. ప్రాణాలు కాపాడుకోండి.. అంటూ ట్రాఫిక్ పోలీసులు చేస్తున్న ప్రచారాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ద్విచక్ర వాహనాలపై ముగ్గురేసి ప్రయాణిస్తున్నారు. అంతేకాకుండా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారు. తమ ప్రాణాలతోపాటు ఎదుటి వారి ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

పేదలకు ఇళ్ల స్థలాల సాధనే లక్ష్యం


మాట్లాడుతున్న భిక్షపతి

జ్యోతినగర్(రామగుండం): పేదలకు ఇళ్ల స్థలాల సాధనే సీపీఎం లక్ష్యమని భూ పోరాట కేంద్రం కన్వీనర్ ఎస్.భిక్షపతి అన్నారు. సోమవారం ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీ సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన భూ పోరాట కేంద్రం టీం లీడర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ భూమిని ఇచ్చేంతవరకు ఉద్యమం కొనసాగిస్తామన్నారు. ఈ నెల 18న గోదావరిఖనిలో జరగనున్న బహిరంగ సభకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరు కానున్నారని తెలిపారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం నుంచి చౌరస్తా వరకు వేలాది మందితో నిర్వహించే ప్రజా ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు రామాచారి, లక్ష్మారెడ్డి, సుజాత, కరుణ, అలివేలు మంగ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా ఉద్యమాలతోనే గుర్తింపు'


ఆడియో క్యాసెట్ ఆవిష్కరిస్తున్న రాజేందర్

సుల్తానాబాద్(పెద్దపల్లి): ప్రజా ఉద్యమాలతోనే గుర్తింపు లభిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్ పేర్కొన్నారు. సుల్తానాబాద్‌లోని ఆర్యవైశ్య భవనలో సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్‌కు చెందిన ఆడియో పాటల క్యాసెట్ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రథయాత్ర చేపట్టారన్నారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, పట్టణాధ్యక్షుడు ఎల్లంకి రాజు, బీజేపీ నాయకులు మహేందర్, ఆరెపల్లి రాహుల్, పల్లె తిరుపతి, భూసారపు సంపత్, కొల్లూరి సంతోష్, గుండ్ల వెంకటేశ్, అన్వేశ్, ధరాడే శ్యామ్‌కుమార్, ఐలవేణి సంతోశ్‌కుమార్, కల్వల రాకేశ్ పాల్గొన్నారు.

సినీ, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి పరామర్శ


నివాళి అర్పిస్తున్న శివారెడ్డి

రామగుండం: సినీ, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి బాల్యమిత్రుడు బాణాల శ్రీధర్ తల్లి భూలక్ష్మి ఇటీవల మృతిచెందింది. దీంతో ఆయన సోమవారం హైదరాబాద్ నుంచి రామగుండంలోని తన స్నేహితుడి ఇంటికి వచ్చారు. భూలక్ష్మి చిత్రపటానికి నివాళి అర్పించి, బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఆరుముళ్ల కనకపాల్, కొమ్మురాజుల మల్లేశ్, పాత శ్రీనివాస్, నాయిని సునీల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీని వెంటనే అరెస్టు చేయాలి



ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ నాయకుల నిరసన



గోదావరిఖనిలో ఐఎఫ్‌టీయూ నాయకులు..

కమాన్‌పూర్(మంథని): మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఆకుల వెంకన్న, పీవోడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షురాలు రజిత కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సెంటనరీకాలనీలో నిరసన తెలిపారు. ఒలింపిక్స్‌లో పతకాలు సాధించి, దేశానికి పేరు తీసుకువచ్చిన మహిళా రెజ్లర్లను భారత రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ లైంగికంగా వేధిస్తున్నారని ఫిర్యాదులు చేసినా చర్యలు తీసుకోవడంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. బాధితులు చేస్తున్న న్యాయ పోరాటానికి ఐఎఫ్‌టీయూ, పీవోడబ్ల్యూ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు కనకలక్ష్మి, పద్మ, రాజేశ్వరి, సరోజన, భాగ్య, శాంతమ్మ, విజయ, సావిత్రి, రమేశ్, విజయలక్ష్మి, నరేందర్, వసంత తదితరులు పాల్గొన్నారు.

రెజ్లర్ల పోరాటానికి సంపూర్ణ మద్దతు

జ్యోతినగర్(రామగుండం): మహిళా రెజ్లర్ల న్యాయ పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చిలుక శంకర్ తెలిపారు. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఎన్టీపీసీ రామగుండంలో నిరసన తెలిపారు. న్యాయం కోసం పది మంది మహిళా క్రీడాకారులు సుప్రీంకోర్టును ఆశ్రయించారని, ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తే వారిపై పోలీసుల నిర్బంధం విధించడం దురదృష్టకరమన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న, రాయమల్లు, లక్ష్మి, శోభ, అరుణ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

చర్య తీసుకోకపోవడం దుర్మార్గం..

గోదావరిఖని(రామగుండం): మహిళా రెజ్లర్లకు మద్దతుగా ఐఎఫ్‌టీయూ నాయకులు సోమవారం గోదావరిఖని ఫైలాన్ సెంటర్ వద్ద నిరసన తెలిపారు. తమపై బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని బాధితులు ఫిర్యాదు చేసినా కేంద్రం పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వం నేరస్తులకు అండగా నిలవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఎంపీపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినా ఇప్పటివరకు చర్య తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. నాయకులు కృష్ణ, నరేశ్, కొమురయ్య, యూసుఫ్, రాంకీ, శ్రావణ్, శివకుమార్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ ఎంపీపీ మృతి

- ఉమ్మడి రామగుండం మండలంలో సేవలందించిన బర్పటి కిష్టయ్య


కిష్టయ్య (ఫైల్)


అంత్యక్రియల్లో డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్

రామగుండం: ఉమ్మడి రామగుండం మండల ఎంపీపీగా సేవలందించిన బర్పటి కిష్టయ్య (72) ఆదివారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఆయన స్వగ్రామం ప్రస్తుత అంతర్గాం మండలంలోని విసంపేట. కిష్టయ్య భార్య ఐదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతిచెందగా ఒక కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు విజయ్ యుగంధర్ ఆసిఫాబాద్‌లోని గోదావరి అర్బన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. కాగా కిష్టయ్య ఇంట్లో ఒక్కరే ఉంటూ వ్యవసాయ పనులు చేసుకునేవారు. విసంపేట నూతన గ్రామ పంచాయతీగా ఆవిర్భవించగా రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో తన కూతురు మీస అనితను బరిలో నిలిపి, గెలిపించుకున్నారు. పరిపాలనా దక్షుడిగా పేరున్న ఆయన తన కూతురి వెనక ఉండి, ప్రణాళికాబద్ధంగా గ్రామంలో అభివృద్ధి పనులు చేయిసూత్ గ్రామస్తుల మన్ననలు పొందారు. కిష్టయ్య ఆకస్మిక మృతితో విసంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అంత్యక్రియలకు ప్రముఖుల హాజరు

సోమవారం ఉదయం నిర్వహించిన కిష్టయ్య అంత్యక్రియలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, అంతర్గాం, పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యులు ఆముల నారాయణ, కందుల సంధ్యారాణి, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ, అంతర్గాం ఎంపీపీ దుర్గం విజయ, మాజీ ఎంపీపీ ఉరిమెట్ల రాజలింగం, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ ప్రాంతాల నుంచి పెరిక సామాజికవర్గ ప్రతినిధులు హాజరయ్యారు. ఆయన కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వీవోఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలి


దీక్షకు మద్దతు తెలుపుతున్న సునీల్‌రెడ్డి

మంథని: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఐకేపీ వీవోఏలు చేస్తున్న సమ్మెకు బీజేపీ మంథని నియోజకవర్గ నాయకుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి మద్దతు తెలిపారు. మంథని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వీవోఏల నిరవధిక దీక్షా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. మహిళా సాధికారత కోసం పని చేస్తున్నామని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వానికి వీవోఏలు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్టీ అసెంబ్లీ కో–కన్వీనర్ నాంపల్లి రమేశ్, బీఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిలువేరు సతీశ్, పట్టణ శాఖ అధ్యక్షుడు ఎడ్ల సదాశివ్, ప్రధాన కార్యదర్శి సబ్బని సంతోష్, ముత్తారం మండల ఇన్‌చార్జి పోతరవేణి క్రాంతికుమార్, నాయకులు బోగోజు శ్రీనివాస్, కోరబోయిన మల్లికార్జున్ తదితరులున్నారు.

ఓసీపీ-1, 2ల విస్తరణ పూర్తి చేయండి

- సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్వీకే.శ్రీనివాస్



మాట్లాడుతున్న డైరెక్టర్ ఎన్వీకే.శ్రీనివాస్

కమాన్‌పూర్(మంథని): ఆర్జీ–3 పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించుకోవాలని సింగరేణి డైరెక్టర్ ఆపరేషన్స్ ఎన్వీకే.శ్రీనివాస్ అన్నారు. ఆర్జీ–3 జీఎం కార్యాలయంలో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్జీ–3, ఏపీఏ ఏరియాల్లో లక్ష్యాలను సాధించడానికి పక్కా ప్రణాళికలు రూపొందించుకోవాలని, ఓసీపీ–1, 2ల విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి, బొగ్గు ఉత్పత్తి జరిగేలా చూడాలన్నారు. వేసవి నేపథ్యంలో ఉపరితల గనుల్లో జాగ్రతలు పాటించాలని, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీపీపీ జీఎం సీహెచ్.నరసింహారావు, ఆర్జీ–3 జీఎం టి.వెంకటేశ్వర్‌రావు, ఏపీఏ జీఎం కె.వెంకటేశ్వర్లు, అధికారులు ఎలిషా, సీతారామం, బైద్య, రాధాకృష్ణ, నరేందర్, శ్రీనివాస్, రఘురాం, నాగరాజు, చంద్రశేఖర్, పద్మరాజు, ఐలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కరెంట్‌షాక్‌తో వ్యవసాయ కూలీ మృతి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి శివారు బందంపల్లికి చెందిన వ్యవసాయ కూలీ అనుమాల నర్సయ్య (35) కరెంట్‌షాక్‌తో ప్రాణాలు కోల్పోయాడు. బందంపల్లికే చెందిన రైతువద్ద కూలీగా పనిచేస్తున్న నర్సయ్య పారతో చెత్తను తోడేందుకు యత్నిస్తుండగా అదే ప్రాంతంలో భూమిలో నుంచి వేసిన విద్యుత్‌తీగ తెగి కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. మృతుడి భార్య గతంలోనే మరణించగా.. కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె సింధు ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..


లక్ష్మారెడ్డి (ఫైల్)

ఓదెల(పెద్దపల్లి): కొలనూర్ గ్రామానికి చెందిన గీట్ల లక్ష్మారెడ్డి(60) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పొత్కపల్లి ఇన్‌చార్జి ఎస్సై లక్ష్మీరాజం కథనం ప్రకారం.. లక్ష్మారెడ్డి భార్య 12 ఏళ్ల క్రితం చనిపోయింది. ఆయన నెల రోజుల క్రితం అనారోగ్యానికి గురవడంతో వైద్యులు కాలివేళ్లను తొలగించారు. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తి చెంది, ఆదివారం క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం చనిపోయాడు. మృతుడి కుమారుడు రాఘవరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జి ఎస్సై పేర్కొన్నారు.

ఒకరి ఆత్మహత్య

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మార్కండేయకాలనీకి చెందిన కాంట్రాక్టు కార్మికుడు పారుపల్లి శ్రీనివాస్(32) సోమవారం ఆత్మహత్య చేసుకున్నా డు. వివరాల్లోకి వెళ్తే.. కొంత కాలంగా మద్యానికి బానిసైన శ్రీనివాస్ సోమవారం కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం ఇంట్లోకి వెళ్లి, ఉరివేసుకున్నాడు. మృతుని తల్లి విజయలక్ష్మి ఫిర్యాదుతో ఎస్సై కమలాకర్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.